అన్నదానాలు.. ప్రత్యేక పూజలు

గణేశ్ నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని ఏర్పాటు చేసిన వినాయక మండపాల వద్ద ఉత్సవ కమిటీలు ఆదివారం అన్నదానం కార్యక్రమాలు నిర్వహించారు. ఖమ్మం జిల్లాలోని అన్ని మండపాల వద్ద ప్రత్యేక పూజలు చేశారు.
- నమస్తే నెట్‌వర్క్

రఘునాథపాలెం : ముస్తఫానగర్‌లో పాల్గొన్న బొమ్మా రాజేశ్వరరావు కుటుంబ సభ్యులు

మధిర రూరల్: పూజల్లో పాల్గొన్న లింగాల కమల్‌రాజు

రఘునాథపాలెం : ఎన్ఎస్‌టీ రోడ్డులో అన్నదానం

రఘునాథపాలెం : పాండురంగాపురంలో పల్లకి సేవ చేస్తున్న ఉత్సవ కమిటీ

రఘునాథపాలెం : బీవీ పాలెంలో అన్నదానం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

వేంసూరు: గణనాథుడికి పూజలు చేస్తున్న మట్టా దయానంద్

సత్తుపల్లి టౌన్: వినాయకుడికి పూజలు చేస్తున్న మున్సిపల్ చైర్మన్

కారేపల్లి: పూజలు నిర్వహిస్తున్న సీఐ, ఎస్సై

మామిళ్లగూడెంలో కుంకుమ పూజ

చింతకాని: లచ్చగూడెంలో అన్నదానాన్ని ప్రారంభిస్తున్న మాజీ వైస్ఎంపీపీ

వెంకటేశ్వరరావుకు జ్ఞాన బుద్ధి పౌర్ణమ జాతీయ అవార్డు

వెంకటేశ్వరరావుకు సత్కరిస్తున్న నిర్వాహకులు

చింతకాని, సెప్టెంబర్15: తెలుగు వెలుగు జాతీయ సాహితి వేదిక ఆధ్వర్యంలో విజయవాడ బాలోత్సవ భవన్‌లో మధిర సహాయ షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి ఇన్‌చార్జి అధికారిగా, చింతకాని మండలం నాగులవంచ గ్రామంలో హాస్టల్ వార్డెన్‌గా పని చేస్తున్న కొత్త వెంకటేశ్వరరావుకు జ్ఞాన బుద్ధి పౌర్ణమ జాతీయ పురస్కారంతో ఆదివారం సన్మానించారు. పూర్వ నాసా శాస్త్రవేత్త చందు సాంబశివరావు, గుర్రం జాషువా వారసురాలు అమృత పూరి రేవతి, ఝాన్సీ లక్ష్మీబాయి, వారసురాలు శాంతాబాయి చేతుల మీదుగా జాతీయ పురస్కారం అందజేశారు. ఉద్యోగం, సామాజిక సేవా రంగాల్లో విశిష్ట కృషి చేస్తున్నందుకు ఈ అవార్డులు అందజేసినట్లు సంస్థ నిర్వాహకులు, జాతీయ చైర్మన్ తెలుగు వెలుగు సాహితి వేదిక బ్రహ్మశ్రీ పోలోజు రాజ్‌కుమార్ తెలిపారు.

ఇంజినీర్ భాస్కర్‌కు సన్మానం

ఇటికల భాస్కర్‌ను సన్మానిస్తున్న సంస్థ సభ్యులు

వైరాటౌన్, సెప్టెంబర్ 15: తెలుగు, వెగులు సాహితివేదిక సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం విజయవాడలోని బాల భవన్‌లో ఇంజినీర్స్‌డే సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సివిల్ ఇంజినీరింగ్ రంగానికి చేస్తున్న కృషికి గుర్తింపుగా ఇటికల భాస్కర్‌ను సన్మానించారు. భాస్కర్ ప్రస్తుతం వైరా, మణుగూరు మున్సిపాలిటీలు, ఖమ్మంలోని సుడా టౌన్ ప్లానింగ్ విభాగంలో జేపీవోగా పనిచేస్తున్నారు.

'మిస్ట్'లో ఇంజినీర్స్‌డే

సత్తుపల్లిటౌన్, సెప్టెంబర్ 15: స్థానిక మదర్‌థెరిస్సా అటానమస్ ఇంజినీరింగ్ కళాశాలలో ఆదివారం డాక్టర్ మోక్షగుండం విశ్వేరయ్య జయంతి సందర్భంగా ఇంజినీర్స్‌డేను నిర్వహించారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ చలసాని సాంబశివరావు మోక్షగుండం విగ్రహానికి నివాళి అర్పించి మాట్లాడారు. మోక్షగుండం దేశానికి నిర్మాణరంగంలో అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ చలమాల హరికృష్ణ, చైర్మన్ కంచర్ల సత్యనారాయణ, డీన్ ఇంజినీరింగ్ డాక్టర్ జాకీర్‌హుస్సేన్, ఐక్యూసీ కోఆర్డినేటర్ డాక్టర్ ఎంవీ రామచంద్రరావు, సివిల్ ఇంజినీరింగ్ విభాగ అధిపతి డాక్టర్ ఎల్.సాయిఇంద్రసేనా రెడ్డి, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

వైరాటౌన్, సెప్టెంబర్ 15: మండలంలోని వైరా టౌన్, సోమవరం, తాటిపూడి, కొష్టాల, జింకలగూడెం, రెబ్బవరం, గండగలపాడు, లక్ష్మీపురం, ముసలిమడుగు, ఖానాపురం, కొండకొడిమ, స్టేజిపినపాక, సిరిపురం, పూసలపాడు గ్రామాల్లో 33 కేవీ లైన్‌మరమ్మతుల కారణంగా సోమవారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని వైరా విద్యుత్ అధికారి అదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

రేపటి నుంచి రుణమాఫీ కుటుంబ నిర్ధారణ కార్యక్రమం ప్రారంభం

ఎర్రుపాలెం, సెప్టెంబర్ 15: భారీ వర్షాల కారణంగా వాయిదా పడిన రుణమాఫీ కుటుంబ నిర్ధారణ కార్యక్రమం తిరిగి మంగళవారం నుంచి ప్రారంభిస్తామని మండల వ్యవసాయ అధికారి ఎం రాధ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 17వ తేదీన ఎర్రుపాలెం రైతువేదికలో రేమిడిచర్ల, ఎర్రుపాలెం, కేసిరెడ్డిపాలెం, రామాపురం, రంగగూడెం, ఇనగాలి, శఖునవీడు గ్రామాలు, 18న మామునూరు రైతువేదికలో మామునూరు, నర్సింహాపురం, రాజులదేవరపాడు, బుచ్చిరెడ్డిపాలెం, లక్ష్మీపురం గ్రామాలు, 19న అయ్యవారిగూడెం రైతువేదికలో అయ్యవారిగూడెం, బీమవరం, గట్లగౌరవరం గ్రామాలు, 20న జమలాపురం రైతువేదికలో జమలాపురం, రాజుపాలెం, తాటిగూడెం, గట్లగౌరవరం కాచారం, బనిగండ్లపాడు, పెద్దగోపవరం, చొప్పకట్లపాలెం గ్రామాలకు సంబంధించి సర్వే నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు.

ఆర్థికసాయం

వేంసూరు, సెప్టెంబర్15: మండలంలోని రామన్నపాలెం గ్రామానికి చెందిన ముక్క హరిబాబు, రోజా దంపతులు తమ ఇద్దరు పిల్లలతో కూలి పనులు చేసుకుని జీవిస్తున్నాడు. గత నెలలో కరెంట్ షార్ట్ సర్క్యూట్‌లో గుడిసె కాలిపోయింది. ప్రమాదంలో హరిబాబు, అతని కుమారుడు స్వల్పగాయాలతో బయటపడగా భార్య రోజా, కూతురు మౌనికకు తీవ్రగాయాలు కాగా చికిత్స కోసం హైదరాబాద్ తరలించారు. చికిత్స పొందుతూ కూతురు మౌనిక మృతిచెందగా, తల్లి మంచంలోనే ఉంది. విషయం తెలుసుకున్న గ్రామానికి చెందిన యువకులు రూ.45వేలు ఆదివారం కుటుంబ సభ్యులకు అందజేశారు.

నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలి

దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్న నాయకులు

తిరుమలాయపాలెం, సెప్టెంబర్ 15: మండలంలోని కొక్కెరేణి, ఎర్రగడ్డలో పంటలు దెబ్బతిన్న రైతులకు పరిహారం చెల్లించాలని బీఆర్ఎస్ నాయకుడు గంట కృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కొక్కెరేణి, గోపాలపురం దెబ్బతిన్న పంటలు, తెగిపోయిన బీటీ రోడ్డును వివిధ పార్టీల నాయకులు ఆదివారం పరిశీలించారు. కార్యక్రమంలో పోలెపొంగు వెంకటేశ్వర్లు, ఎమ్మార్పీఎస్ నాయకుడు పోలెపొంగు రాంగోపాల్, రైతులు పాల్గొన్నారు.

వరద బాధితులకు నిత్యావసర సరుకులు పంపిణీ

నిత్యవసర వస్తువులు పంపిణీ చేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

వైరాటౌన్, సెప్టెంబర్15: లయన్స్ క్లబ్ వైరా, లయన్స్‌క్లబ్ గ్రేట్ విజన్ లయన్స్ ఇంటర్నేషనల్ ఫండ్ సంయుక్త ఆధ్వర్యంలో వైరా లోని ఇందిరమ్మ కాలనీ, ఇతర ప్రాంతాల్లో వర్షాల వల్ల ఇళ్లు కూలిపోయిన బాధితులకు క్లబ్ సభ్యులు నిత్యావసర సరుకులు అందజేశారు. ఆదివారం స్థానిక దత్త సాయి కల్యాణ మండపంలో జీఎస్టీ కోఆర్డినేటర్ వుండ్రు శ్యామ్‌బాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఫాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ కాపా మురళీకృష్ణ మాట్లాడారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ వైరా అధ్యక్షుడు చింతలపూడి వెంకటేశ్వరరావు, గ్రేట్ విజన్ అధ్యక్షుడు తోటకూర శ్రీకాంత్, జోన్ చైర్మన్ పెనుగొండ ఉపేంద్రరావు, డిస్ట్రిక్ట్ క్యాబినెట్ జాయింట్ సెక్రటరీ లగడపాటి ప్రభాకర్, కార్యదర్శి అబ్బూరి రమేష్, కోశాధికారి మరికంటి రాంగోపాల్, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

వరద బాధితుల కోసం వస్తువుల సేకరణ

కొణిజర్ల, సెప్టెంబర్15: గణపతి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ పిలుపు మేరకు 'నా ఖమ్మం కోసం నేను' అనే కార్యక్రమంలో భాగంగా వైరా మున్సిపల్ కమిషనర్ వేణు ఆదేశాల మేరకు పల్లిపాడు ఫ్రెండ్స్‌యూత్ ఆధ్వర్యంలో ఖమ్మం వరద బాధితుల కోసం నగదు, దుస్తులు, గిన్నెలు సేకరించారు. వీటిని ఆదివారం ఫ్రెండ్స్ యూత్ కమిటీ సభ్యులు 16వ వార్డు ఆఫీసర్ బాలమురళీకృష్ణకు అందజేశారు. కార్యక్రమంలో ఫ్రెండ్స్‌యూత్ అధ్యక్షుడు తాటిపల్లి సుధీర్, కమిటీ సభ్యులు మున్సిపాలిటీ సిబ్బంది పాల్గొన్నారు.

మున్నేరు బాధితులకు అండగా నిలిచిన లేడీస్ టైలర్స్

విరాళాలు సేకరిస్తున్న సత్తుపల్లి మండల లేడీస్ టైలర్స్

సత్తుపల్లిటౌన్, సెప్టెంబర్15: మున్నేరు వరద బాధితులను ఆదుకోవడం కోసం సత్తుపల్లి లేడీస్ టైలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ బాధ్యులు పట్టణంలో బట్టల దుకాణాలు, వ్యాపారస్తులు, ఇతరుల ద్వారా రూ.46 వేలు, దుస్తులను సేకరించారు. వస్తువులను ఖమ్మంలోని మంచికంటి భవన్‌లో ఐద్వా బాధ్యులు మాచర్ల భారతి, బుగ్గవీటి సరళ, బండి పద్మకు అందజేశారు. వీరిని ఐద్వా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మాచర్ల భారతి, బండి పద్మ, బుగ్గవీటి సరళ అభినందించారు. కార్యక్రమంలో సత్తుపల్లి లేడీస్ టైలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ బాధ్యులు జాజిరి జ్యోతి, సతీష్, ఇమాం, చావా కవిత, భరత్, షేక్ మున్నీ, చాందిని, మల్లేశ్వరి, అరుణ, కవిత, లింగేశ్వరి, మిథున్, మౌనిక, నాగలక్ష్మి, సత్యం, యాసిన్ పాల్గొన్నారు.

నిత్యావసర వస్తువులు, పేట్లు, గ్లాసులు అందజేత

తిరుమలాయపాలెం, సెప్టెంబర్ 15: మండలంలోని రాకాశితండా వరద బాధితులకు ఆదివారం బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తాతా మధుసూదన్ సోదరుడు తాతా విశ్వేశ్వరరావు నాగమణి దంపతుల కుమారుడు స్వర్గీయ తాతా నిఖిల్ చౌదరి జ్ఞాపకార్థం ప్లేట్లు, గ్లాసులు, నిత్యవసర వస్తువులు అందజేశారు. రాకాశితండా బాధితులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో తాతా రవీందర్, రమేష్, అశ్వినీకుమార్, మల్లిడు రమేష్, మద్దెల విజయ్, సుమంత్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. పీఎస్ఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిత్యవసరవస్తువులు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు రామసహాయం నరేష్‌రెడ్డి, చావా శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మహిళల రక్షణలో పాలకులు విఫలం

ముదిగొండ, సెప్టెంబర్ 15: మహిళలకు రక్షణ కల్పించటంలో పాలకులు విఫలమయ్యారని ఐద్వా రాష్ట్ర మాజీ అధ్యక్షురాలు బుగ్గవీటి సరళ విమర్శించారు. ముదిగొండలోని మచ్చా వీరయ్య భవన్‌లో ఆదివారం జరిగిన మహిళ మండలి సభలో ఆమె మాట్లాడారు. ప్రతి మహిళ ఏదో ఒక చోట వివక్షకు గురవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. స్త్రీని దేవతగా పూజించే దేశంలో అంగడి సరుకుగా మార్చిన తీరు యావత్ మహిళా లోకానికి అవమానకరమని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన మహిళలకు రూ. 2500 ఇస్తామని మోసం చేసిందని అన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు బండి పద్మ, మాచర్ల భారతి తదితరులు పాల్గొన్నారు.

సాగునీటిని అందించి పంటలను కాపాడాలి

ఎండిపోతున్న పంటలను చూపుతున్న రైతులు

పెనుబల్లి, సెప్టెంబర్15: సాగునీరు అందించి ఎండిపోతున్న పంట పొలాలను కాపాడాలని రైతులు కోరుతున్నారు. ఆదివారం కల్లూరు మండలంలోని చండ్రుపట్ల గ్రామంలో ఎండిపోతున్న పంటలను పరిశీలించారు. కల్లూరు డివిజన్ పరిధిలోని మధిర బ్రాంచ్ కాలువ పరిధిలో వానకాలంలో సాగు చేసిన వరిపైరుకు సాగునీరు అందించి పంటలను కాపాడలని కోరారు. ఇప్పటికే పొలాల్లో సాగునీరు లేక నెర్రలిచ్చాయని ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని చండ్రుపట్ల, లింగాల, ఎర్రబోయిన పల్లి, వాచ్యనాయక్‌తండా, రఘునాథబంజర, చెన్నూరు తదితర గ్రామాల్లో సాగర్ ఆయకట్టు కింద పంటలు సాగునీరు లేక ఎండిపోయే దశకు చేరుకున్నాయన్నారు. రైతాంగ అవస్థలను దృష్టిలో పెట్టుకొని సాగునీరు అందించే విషయంలో జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రులు ప్రత్యేక చూపాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో రైతులు జక్కంపూడి కిషోర్, వల్లపనేని రవి, దొడ్డపునేని రవి, వల్లపునేని శ్రీనివాసరావు, వైకుంఠపు కృష్ణారావు, పోట్రు వీరభద్రం, దొడ్డపునేని వెంకటేశ్వరరావు, నెల్లూరు సత్యనారాయణ పాల్గొన్నారు.

సాయుధ తెలంగాణ పోరాట వారసులు కమ్యూనిస్టులే

మధిర: మాట్లాడుతున్న పోటు ప్రసాద్

మధిర, సెప్టెంబర్15: సాయుధ తెలంగాణ పోరాట వారసులు కమ్యూనిస్టులేనని సీపీఐ జాతీయ సమితి సభ్యుడు భాగం హేమంతరావు అన్నారు. సాయుధ తెలంగాణ పోరాట వారోత్సవాల సందర్భంగా ఆదివారం మధిర పట్టణంలోని వాసిరెడ్డి వెంకటపతి స్థూపం వద్ద ఉన్న సీపీఐ జెండాను ఆవిష్కరించగా సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ వెంకటపతి స్థూపానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా మధిర పట్టణ కార్యదర్శి బెజవాడ రవి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో భాగం, పోటు మాట్లాడుతూ నాటి నైజం నవాబు నిరంకుశ పాలనలో జగిర్దారర్లు , జమిందార్లు, దేశ్‌ముఖ్ దగ్గర వెట్టిచాకిరి చేస్తున్న మట్టి మనుషులను బందూకులు పట్టించి మూడు వేల గ్రామాలను విముక్తి చేసి, 10 లక్షల ఎకరాలను పేదప్రజలకు పంచిన చరిత్ర కమ్యూనిస్టులదన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎర్రాబాబు, జమ్ముల జితేందర్‌రెడ్డి, పోటు కళావతి, ఏపూరి లత, సింగు నర్సింహారావు, శివరామకృష్ణ, ఏపూరి లత, రామాంజేయులు, మధిర, బోనకల్లు, మండల కార్యదర్శులు ప్రకాశరావు, మురళీ, రోషన్, గాంధీ, ఏఐఎస్ఎఫ్ నాయకులు లక్ష్మణ్, రామకృష్ణ పాల్గొన్నారు.

బోనకల్లులో..

బోనకల్లు, సెప్టెంబర్15: భారతదేశంలో తెలంగాణ ప్రాంతం విలీనం కావడానికి కమ్యూనిస్టులతోనే సాధ్యమైందని సీపీఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు అన్నారు. ఆదివారం తెలంగాణ సాయుధ రైతాంగం పోరాటం వారికోత్సవ వారోత్సవాల సందర్భంగా మండలంలోని రాపల్లి, బ్రాహ్మణపల్లి గ్రామాల్లో అమరవీరుల స్థూపాలకు సీపీఐ జిల్లా కార్యదర్శితో కలిసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిజాం మీర్‌ఉస్మాన్‌అలీఖాన్ తెలంగాణ ప్రాంతాన్ని ప్రత్యేక దేశంగా ప్రకటించుకున్న తర్వాత రావి నారాయణరెడ్డి, మొహ్మద్ ముగ్దంమెహినుద్దీన్, బద్ధం ఎల్లారెడ్డిల నాయకత్వంలోని కమ్యూనిస్టుల సాయుధ పోరాటానికి పిలుపునిచ్చారన్నారు. కార్యక్రమంలో నాయకులు జమ్ముల జితేందర్‌రెడ్డి, ఎర్రబాబు, ఏపూరి లతాదేవి, సింగు నరసింహారావు, తోట రామాంజనేయులు, రావి శివరామకృష్ణ, యంగల ఆనందరావు పాల్గొన్నారు.

సీఆర్‌పీ చేసి మహిళ ను కాపాడిన కానిస్టేబుల్

కారేపల్లి, సెప్టెంబర్ 15: భార్యాభర్తల మధ్య తగాదాలలో క్షణికావేశంలో ఉరివేసుకొని అపస్మారక స్థితిలో ఉన్న మహిళను కారేపల్లి బ్లూకోర్టు కానిస్టేబుల్ సీతారాములు సీఆర్‌పీ చేసి కాపాడిన ఘటన మండలంలో ఆదివారం చోటుచేసుకున్నది. మండలంలోని ఓ తండాకు చెందిన భార్యభర్తలు గొడవపడి ఉరి వేసుకుంది. 108 డ్రైవర్ సైదులు ఆ ప్రాంతానికి వెళ్లగా ఇంట్లో మహిళ ఉరివేసుకొని ఉండడాన్ని గమనించి ఇంటి తలుపు తీసి లోనికి వెళ్లి పోలీసులు మహిళను దించి సీఆర్‌పీ చేశారు. ఖమ్మం ఆసుపత్రికి తరలించారు. మహిళ ప్రాణాలతో బయట పడింది. మహిళను కాపాడిన కానిస్టేబుల్ సీతారాములు, డ్రైవర్ సైదులును తండా వాసులు అభినందించారు.

ప్రభుత్వ విద్యారంగ బలోపేతానికి ఉపాధ్యాయుల కృషి చేయాలి

మాట్లాడుతున్న యలమద్ది వెంకటేశ్వర్లు

మధిర, సెప్టెంబర్ 15: ప్రభుత్వ విద్యారంగం, ప్రభుత్వ పాఠశాలలు బలోపేతానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని పీఆర్‌టీయూ జిల్లా శాఖ అధ్యక్షుడు యలమద్ది వెంకటేశ్వర్లు సూచించారు. ఆదివారం పీఆర్‌టీయూ మండల శాఖ ఆధ్వర్యంలో స్థానిక టీవీఎం ప్రభుత్వ పాఠశాలలో రవికుమార్ అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏ రాజకీయ పార్టీని అనుబంధం లేకుండా కేవలం ఉపాధ్యాయ సంక్షేమం, విద్యారంగ అభివృద్ధే లక్ష్యంగా గత 5 దశాబ్దాలుగా పీఆర్‌టీయూ పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.రంగారావు, నాయకులు కేవీ యేసు, చలపతిరావు, ఎల్.మోహన్‌రెడ్డి, డీ వెంకటేశ్వరరావు, ఎస్‌కే మదార్, రెబ్బ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

గిరిప్రసాద్ స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలు

వైరా రూరల్, సెప్టెంబర్ 15: తెలంగాణ సాయుధ పోరాట యోధుడు సీపీఐ నేత నల్లమల్ల గిరప్రసాద్ స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలు చేస్తునట్లు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బాబాగం హేమంత్‌రావు తెలిపారు. మండలంలోని పాలడుగు గ్రామంలో ఆదివారం సాయుధ పోరాట వారోత్సవాలలో భాగంగా గిరి ప్రసాద్ స్మారక స్థూపానికి నివాళులర్పించి మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

సిరిపురం వైద్య శిబిరం

వైరా రూరల్, సెప్టెంబర్ 15: మండలంలోని కేజీ సిరిపురం గ్రామంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పువాళ్ల దుర్గాప్రసాద్ ప్రారంభించారు. పలువురికి వైద్యులు వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు.

లడ్డూను దక్కించుకున్న మీరా సాహెబ్

వైరారూరల్, సెప్టెంబర్ 15: మండలంలోని ఖానాపురం గ్రామంలో ఏర్పాటు చేసిన వినాయక మండపంలో వినాయకుడికి ఉంచిన లడ్డూను ఆదివారం వేలం నిర్వహించారు. గ్రామానికి చెందిన షేక్ మీరా సాహెబ్ వేలం పాల్గొని రూ. 12 వేలకు వినాయక లడ్డును దక్కించుకున్నాడు.

సీతారాం ఏచూరికి నివాళి

కొణిజర్ల, సెప్టెంబర్ 15: మండలంలోని చిన్నగోపతి గ్రామంలో సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి చిత్రపటానికి సీపీఎం నాయకులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో నాయకులు బోయినపల్లి శ్రీనివాస్‌రావు, బుర్రి గోపయ్య, బలమాల యోహాను, రూబేన్, కొచ్చర్ల లెనిన్, కురెల్లి సరోజిని, డేవిడ్, నిర్మల, రుత్తమ్మకుమారి పాల్గొన్నారు.

కమ్యూనిజం అజేయంగా నిలుస్తుంది

బోనకల్లు, సెప్టెంబర్ 15: ప్రస్తుతం కమ్యూనిజమే అజేయంగా నిలుస్తుందని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు పొన్నం వెంకటేశ్వరరావు అన్నారు. ఆదివారం మండలంలోని చొప్పకట్లపాలెంలో సీపీఎం గ్రామశాఖ మహాసభ బొప్పాల అజయ్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించారు. తొలుత సీతారాం ఏచూరి, తన్నీరు జగ్గయ్య చిత్రపటాలకు ఆయన పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం జరిగిన మహాసభలో ఆయన మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో సీపీఎంను బలోపేతం చేయాలని, అప్పుడే కమ్యూనిస్టుల బలం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు చింతలచెరువు కోటేశ్వరావు, దొండపాటి నాగేశ్వరరావు, పల్లా కొండలరావు, ఉన్నం వెంకటేశ్వర్లు, కిలారు సురేష్, బోయినపల్లి పున్నయ్య, బండి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అవస్థలు పడుతున మడుపల్లి గ్రామరైతులు

మధిర, సెప్టెంబర్15: మధిర మున్సిపాలిటీ పరిధిలోని మడుపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల పక్కన ఉన్న పొలాలకు వెళ్లే డొంక రోడ్డు కొన్ని రోజుల క్రితం కురిసిన భారీ వర్షాలకు గండిపడడంతో రైతులు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. రైతులు ట్రాక్టర్లు వెళ్లే మార్గం లేక అవస్థలు పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతులు చేయాలని రైతులు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో హోంగార్డుకు తీవ్రగాయాలు

కారేపల్లి, సెప్టెంబర్15: విధుల నిమిత్తం ఖమ్మం వెళ్తున్న హోంగార్డు రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఘటన ఆదివారం కారేపల్లి మండలం చీమలవారిగూడెం వద్ద చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం... ఇల్లెందు మండలం ముకుందాపురం గ్రామానికి చెందిన చందర్ తన అత్తగారి ఊరైన కారేపల్లి మండలం మాదారంలో ఉంటూ ఖమ్మంలో హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్నాడు. ఆదివారం విధులకు వెళ్లేందుకు ద్విచక్రవాహనంపై బయలుదేరాడు. చందర్ చీమలవారిగూడెం మూలమలుపు వద్ద రోడ్డుపై అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. గమనించిన గ్రామస్తులు కుటుంబ సభ్యులకు విషయం తెలిపి ఖమ్మం ఆసుపత్రికి తరలించారు. మూలమలుపు వద్ద మోటార్‌సైకిల్ అదుపు తప్పి పడి ఉంటాడని భావిస్తున్నారు.

ఆలయంలో ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

చింతకాని, సెప్టెంబర్ 15: మండలంలోని వందనం గ్రామ సమీపంలోని గంగమ్మ గుడిలో కొణిజర్ల మండలం అనంతారం గ్రామానికి చెందిన తప్పెట వంశీ (26) ఉరి వేసుకుని ఆదివారం తెల్లవారుజామున ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... అనంతారం గ్రామానికి చెందిన వంశీ కొంతకాలం క్రితం ఖమ్మం నగరంలో ఇంటర్‌నెట్ కేంద్రాన్ని నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో ఖమ్మం నగరానికి చెందిన అక్షయ అనే యువతితో ఏర్పడిన పరిచయం కొంతకాలానికి ప్రేమగా మారి అక్షయను గతేడాది ప్రేమ వివాహం చేసుకున్నాడు. పది రోజుల క్రితం భార్య అక్షయను ఆమె తల్లిదండ్రులు తీసుకెళ్ళారు. ఆ రోజు మానసిన వేదనకు గురవుతున్నాడు. శనివారం మధ్యాహ్నం ఖమ్మం వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి బయటకు వచ్చాడు. రాత్రి 10గంటలకు తల్లిదండ్రులకు ఫోన్‌చేసి ఇంటికి వస్తానని చెప్పి ఇంటికి రాలేదు. వంశీ తన ద్విచక్రవాహనంపై వందనం గ్రామశివారున ప్రధాన రహదారి పక్కన గల గంగమ్మ ఆలయం వద్దకు చేరుకోని రేకుల షెడ్‌లో గల ఇనుప రాడ్డుకు తాడుతో ఉరేసుకోని ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామస్తులు, పోలీసుల ద్వారా సమాచారం తెలుసుకున్న వంశీ కుటుంబసభ్యులు ఘటన స్థలానికి చేరుకున్నారు. మృతుడి తండ్రి జకరయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై షేక్ నాగుల్‌మీరా కేసు నమోదు చేసుకోని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఖమ్మం ప్రభుత్వాసుపత్రికి పోలీసులు తరలించారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

మామిళ్లగూడెం, సెప్టెంబర్ 15 : ఖమ్మం ఇందిరానగర్‌లోని ఓ భవనం 3వ అంతస్తు పైనుంచి దూకి గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. ఖమ్మం టూటౌన్ పోలీసులు తెలిపిన ప్రకారం.. ఓ వ్యక్తిని నలుగురు తరుముతుండడంతో తప్పించుకునే క్రమంలో ఇందిరానగర్‌లోని 3వ అంతస్తు బిల్డింగ్ ఎక్కాడు. సదరు వ్యక్తి వారి నుంచి తప్పించుకోవాలనే ఉద్దేశంతో భవనంపై నుంచి దూకినట్లు పోలీసులు తెలిపారు. 3వ అంతస్తు నుంచి దూకడంతో వ్యక్తి తలకు తీవ్రమైన గాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. అతడికి 30 ఏళ్ల వయస్సు ఉంటుందని తెలిపారు. అన్నం ఫౌండేషన్ చైర్మన్ అన్నం శ్రీనివాసరావు బృందం సహాయంతో మృతదేహాన్ని ఖమ్మం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

గుండెపోటుతో ఏఎంసీ సహాయ కార్యదర్శి మృతి

వజీరుద్దీన్ (ఫైల్)

ఖమ్మం వ్యవసాయం, సెప్టెంబర్ 15 : ఖమ్మం నగర వ్యవసాయ మార్కెట్ కమిటీ అసిస్టెంట్ సెక్రటరీ ఎండీ వజీరుద్దీన్(44) గుండెపోట